కొనసాగిన రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి పాడేరు: పాడేరు ఐటిడిఎ పీవోను తక్షణమే సరెండర్ చేయాలని, గిరిజన విద్యార్థుల మరణాలపై విచారణ చేపట్టాలని ఐటీడీఏ వద్ద చేపట్టిన నిరాహార దీక్షలు మంగళవారం తొమ్మిదవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రజాసంఘాల వేదిక కన్వీనర్ కూడ రాధాకృష్ణ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ కె.రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ, విద్యార్థి, మహిళ, కార్మిక, గిరిజన ప్రజా సంఘాలు చేస్తున్న నిరాహార దీక్షలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు.పాడేరు ఐటీడీఏ పిఓను తక్షణమే సరెండర్ చేయాలని, గిరిజనులు, గిరిజన ఉద్యోగులు, గిరిజన ప్రతినిధుల పై అవహేళన చేస్తూ, వేధింపులకు గురి చేయడం తగదన్నారు.పెదబయలు తహసిల్దారు మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతంలో విద్యార్థుల మరణాలపై హైకోర్టు సెట్టింగ్ జడ్జితో విచారణ నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల వేదిక కో కన్వీనర్లు మువ్వాల లక్ష్మణ్, ప్రసాద్, మహిళ సంఘం నాయకురాలు కె.లతకమారి, చిన్నారావు, బత్తిరి నరేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి గిరి విజ్ఞాన సంబరాలు

హాజరు కానున్న మంత్రులు, ఉన్నతాధికారులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: పాడేరు ఐటిడిఎ గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 30 వరకు గిరి విజ్ఞాన సంబరాలను నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధం చేసింది. ఐటిడిఎ పిఒ ఆర్.గోపాలకృష్ణ, టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, డిఇఒ రమేష్ పర్యవేక్షణలో మూడు రోజుల విజ్ఞాన ప్రదర్శన నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. అత్యంత ఘనంగా నిర్వహించే ఈ గిరి విజ్ఞాన సంబరాలకు రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వంలో కీలక హెూదాలో ఉన్న పలువురు ఐఎఎస్ అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపి, ఎస్ టికమిషన్, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. నేటి నుంచి మూడు రోజులపాటు గిరి విజ్ఞాన సంబరాలు-2022 నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసామని టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు తెలిపారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో తలారిసింగి జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాల ఆవరణలో గిరి విజ్ఞాన సంబరాల ఏర్పాట్లపై డిడి పనులను మంగళవారం పరిశీలించారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరి విజ్ఞాన సంబరాలకు హాజరయ్యే అతిథులకు, అధికారులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, సందర్శకులకు ఎక్క ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు రీమలి జాన్, పి.ప్రసాద్, పి.కృష్ణారావు పిడిలు పి.పూర్ణరాజు, ఎస్.సింహాచలం పాల్గొన్నారు.

ఏర్పాట్లను పిఒ పరిశీలన

గిరి విజ్ఞాన సంబరాలను విజయవంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. తలారిసింగి జిటిడబ్ల్యూ బాలురు ఆశ్రమ పాఠశాలలో నిర్వహించనున్న గిరి విజ్ఞాన సంబరాల ఏర్పాట్లను మంగళవారం పిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 28, 29, 30 తేదీలలో గిరి విజ్ఞాన సంబరాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఐటిడిఎ స్థాయిలో జరుగుతున్న గిరి విజ్ఞాన సంబరాల్లో 122 స్కూల్స్ నుండి విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. ప్రతిరోజు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టి డబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, ఎటిడబ్ల్యూఒ ఎల్.రజని, పాఠశాల హెచ్ఎం ఆర్.జాన్, పలువురు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న డీడీ

పింఛన్ల తొలగింపుపై ఆందోళన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: తొలగించిన పింఛన్లు వెంటనే పునరుద్ధరణ చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు డిమాండ చేశారు. మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పరిధి వివిధ గ్రామాల్లో తొలగించిన పింఛన్‌లు వెంటనే పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అరకువేలి సబ్ స్టేషన్ వద్ద పింఛన్లుదారులతో ధర్నా చేశారు. ఈ సంధర్భంగా వారు మట్లాడుతూ, కరెంట్ 300 యునిట్లు దాటి వస్తుందనే సాకుతో పెన్షన్లు తొలగిం చడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.గిరిజన మారుమూల గ్రామాల్లో కరెంటు సక్రమంగా ఉండదని, ఇలాంటి పరిస్థితిలో ఎలా 300 యూనిట్లు వస్తుందన్నారు. భూములు ఎక్కువ ఉందనే సాకుతో పింఛన్ తొలగించడం ఎంతవరకు సమంజసం అన్నారు.పెన్షన్లు తొలగింపుపై ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ప్రజాప్రతినిధులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తక్షణమే తొలగించిన పింఛన్లను పునరుద్ధరణ చేయాలని, లేని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.బాబురావు, జి సన్యాసిరావు, జి.శ్యాంసుందర్, జి.కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న పింఛన్ లబ్దిదారులు, సిపిఎం నాయకులు

కల్వర్టు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

రహదారుల ఏర్పాటుకు చర్యలు

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు రహదారులు ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. సోమవారం ఆయన వై.రామవరం మండలం మారుమూల గ్రామాలైన చింతలపూడి, వలస గ్రామాలకు సంబంధించిన రహదారులను పిఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలపూడి, కోట గ్రామాల మధ్య 3.5 కిలోమీటర్ల రోడ్డు, కన్నేరు వాగుపై వంతెన నిర్మించుటకు చేసిన ప్రతిపాదనలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. వలస జంక్షన్ నుండి బంగారు బందలు మధ్యలో కల్వర్టు ఐఎపి నిధులుతో నిర్మిస్తున్న పనులను అయన పరిశీలించారు. చింతకోయ కన్నేరు కాలువపై రూర్బన్ నిధులతో వంతెన ఏర్పాటును పర్యవేక్షించారు. రోడ్లు, వంతెనలు, కల్వర్ట్‌లు పూర్తిగా ఏర్పాటు చేస్తే వై.రామవరం మండల కేంద్రానికి రాకపోకలకు చాలా దగ్గరగా ఉంటుందని తెలిపారు. అనంతరం చింతలపూడి ఆశ్రమ పాఠశాలను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. విద్యార్థులకు ఇస్తున్న మెనూపై ఆరా తీశారు. విద్యార్థులు ఎంతమంది ఉన్నది, ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నది రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు అనారోగ్యంగా ఉంటే వెంటనే స్పందించి దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తీసుకొని వెళ్లి వైద్య పరీక్షలు చేయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయన వెంట ఇఇ జి.డేవిడ్ రాజు, డిఇ చైతన్య బాబు, ఎఇ భాను, సర్పంచ్ పల్లాల మంగమ్మ, పల్లాల లచ్చిరెడ్డి తదితరులున్నారు.

అటవీ ప్రాంతాన్ని...

కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తే ఊరుకోం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గిరిజన వ్యతిరేక విధానాలు తిప్పి కొట్టండి ▸▸ సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి- పెదబయలు :అటవీ ప్రాంతాన్ని కార్పొరేటర్ కంపెనీలకు అప్పగిస్తే ఊరుకోమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న గిరిజన వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స పిలుపునిచ్చారు. పెదబయలు మండలంలోని గ్రామాలు పర్యటించిన ఆయన కాఫీ రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సిపిఎం కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో అప్పలనర్స మాట్లాడుతూ, అటవీ ప్రాంతాన్ని కార్పోరేట్ కంపెనీలకు అప్పగించాలని నరేంద్ర మోడీ, జగన్మోహన్ రెడ్డి చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని కోరారు. అటవీ ప్రాంతాల సంపదను కార్పొరేట్ వ్యక్తుల పరం చేయాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఒక ప్రణాళిక బద్ధంగా పని చేస్తుందన్నారు. చింతపల్లి మండలం ఎర్రవరం, అనంతగిరి మండలం పెద్దకోట, గుజ్జలి చిట్టంపాడు ప్రాంతాలలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి సుమారు 4800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు 15 వేల ఎకరాల అటవీ భూమిని ధారాదత్తం చేసేందుకు కుట్ర పూరితంగా వ్యవహరిందన్నారు. ఈ చర్యలను ప్రజా, ఉద్యోగ సంఘాలు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఐదో షెడ్యూల్ ఏరియాలోని 1/70 చట్టం, అటవీ హక్కుల చట్టాలను దిక్కరించి గ్రామ సభలో తీర్మానం లేకుండా ఏకపక్షంగా అటవీ సంపదను కొల్లగొట్టేందుకు నరేంద్ర మోడీ, జగన్ మోహన్ రెడ్డి పూనుకోవడం సరైన చర్య కాదన్నారు. గిరిజన ప్రాంత ఎమ్మెల్యే, ఎంపీలు ఈ ప్రయత్నాలను చూస్తూ ఉత్సవ విగ్రహాలుగా ఉన్నారని విమర్శించారు. గిరిజన హక్కులు, చట్టాల అమల్లో ప్రజాప్రతినిధులు వారి చిత్తశుద్ధిని నిరూపించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. నాలుగేళ్ల నుండి కాఫీ రైతులకు సుమారు రూ.60 కోట్ల బకాయిలు చెల్లించ లేదని, ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల్ని దారి మళ్లించి నవరత్నాల పేరుతో గిరిజనులను తీవ్రమైన మోసం చేస్తున్నారని విమర్శించారు. కాఫీ గిట్టుబాటు ధర విషయంలో ప్రభుత్వం దగా చేస్తుందన్నారు. ఓ వైపు జిసిసి, మరో వైపు ప్రైవేట్ సంస్థలు కలిసి కాఫీ రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నారన్నారు. పాచిపెంట్ కాఫీకి కిలోకు రూ. 500, చెరీ కాఫీకి రూ.250లు, మిరియాలకు రూ.1000 గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాఫీ రైతులందరికీ అటవీ భూ పత్రాలు ఇవాలన్నారు. జగనన్న శాశ్వత గృహ పథకం లబ్దిదారులకు ఎక్కడా ఇంటి స్థలం చూపించలేదని, దీనికి సంబంధించిన డబ్బులు కూడా చెల్లించలేదన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యమం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నానికి ప్రజా, ఉద్యోగ సంఘాలు, మేధావులు కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బోండా సన్నిబాబు, పెదబయలు మండల కార్యదర్శి కొమ్మ పృథ్విరాజు, మండల కమిటీ సభ్యులు సరబన్న, బుజ్జి బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

దట్టంగా కురుస్తున్న మంచులో చలి మంట వేసుకొని ఆశ్వాదిస్తున్న పర్యాటకులు

ఆకర్షిస్తున్న మన్యం అందాలు

క్యూ కట్టిన పర్యాటకులు

ప్రజాశక్తి -సీలేరు

విశాఖ మన్యంలో మంచు సోయగాలు, ప్రకృతి రమణీయమైన దృశ్యాలు తిలకించడానికి పర్యాటకులు మంగళవారం క్యూ కట్టారు. జీకే వీధి మండలం దారకొండ ఘాట్ రోడ్డు దారాలమ్మ అమ్మవారి ఆలయ సమీపంలో ఎత్తయిన కొండలు నడుమ జాలువారే జలపాతాలు, మంచు సోయగాలను పర్యాటకులు ఆస్వాదించి మంత్రముగ్ధులయ్యారు. మన్యంలో పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన లంబసింగిలో కాశ్మీరును తలపించే మంచు అందాలను తిలకించి వారి కెమెరాల్లో ఫోటోలు బంధించి ఎంతో అనుభూతిని పొందారు. అదే రహదారి గుండా ప్రయాణిస్తూ గిరిజనులు పండిస్తున్న స్ట్రాబెరీ తోటలు సందర్శించి పర్యాటకులు సందడి చేశారు. చింతపల్లి నుంచి గూడెం వరకు దారి పొడవునా కాఫీ తోటలు, మిరియాల పాదులు, లవంగి యాలిక దాసిన చెక్క చెట్లను చూసి పర్యాటకులు మురిసిపోయారు. అదే రహదారి కొండ దారకొండ ఆలయానికి చేరుకుని ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉన్న అందాలను తిలకించారు. అనంతరం ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. సప్పర్ల సమీపంలో రెయిన్ గేజ్ సీలేరు కాంప్లెక్స్ సమీపంలో ఐస్ గడ్డ అందాలు తదితరు అందాలును పర్యాటకులు తిలకించి పరవశించిపోయారు.

'ఓటర్ల' ఫిర్యాదులపై టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు

ప్రజాశక్తి-పాడేరు: ఓటర్ల జాబితా పై సందేహ నివృత్తికి, ఫిర్యాదులకు కలెక్టరేట్ ఎన్నికల విభాగంలో ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ 18004256826ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చడం, మార్చటం, తొలగింపు, ఫోటో, పోలింగ్ కేంద్రాల మార్పు తదితర అంశాలకు సంబంధించి ఫారం 6, 7 8లలో దరఖాస్తులు స్వీకరించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఆ దరఖాస్తులపై తీసుకున్న చర్యలు, వాటి పరిష్కారం, వాటి పరిశీలన ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవటానికి, ఎపిక్ కార్డుల వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 18004256826 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చుని కలెక్టర్ వివరించారు.

రవాణా శాఖలో పౌర సేవలకు నూతన వెబ్‌సైట్

జిల్లా రవాణా శాఖ అధికారి లీలా ప్రసాద్

ప్రజాశక్తి-పాడేరు: రవాణా శాఖలో అందిస్తున్న ఫౌర సేవలు పొందడానికి పరివాహన్ వెబ్సైట్ వినియోగించుకోవాలని జిల్లా రవాణా అధికారి ఎస్ లీలా ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకు ఉన్న %https://aprtaciti-zen.epragathi.org% బదులుగా % https://pari-vahana.gov.in% అనే వెబ్సైట్‌కు మైగ్రేట్ అయినందున, రవాణా శాఖ వినియోగదారులు గుర్తించి ఫౌర సేవలు, రుసుములు చెల్లింపులు, లావాదేవీలు నూతన వెబ్సైట్ ద్వారా చేపట్టాలని జిల్లా రవాణా అధికారి వివరించారు. ద్విచక్ర వాహనం, నాలుగు చక్రాల వాహనం లెర్నింగ్ లైసెన్స్ కోసం రూ.250, రెండింటికి రూ.410, ద్విచక్ర, నాలుగు చక్రాల డ్రైవింగ్ లైసెన్స్ కోసం రూ.960 రెండింటికి రూ. 1260, డ్రైవింగ్ లైసెన్స్ ఎండాస్మెంట్ కోసం రూ.1260, డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్ కు రూ.660, గ్రేస్ పీరియడ్ తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ రన్నింగ్ వరకు రూ.960, రిజిస్ట్రేషన్ రెన్యువల్ కు వాహనాన్ని బట్టి రూ.835, రూ.6,535, ఫిట్నెస్ సర్వీసెస్ కు వాహనాన్ని బట్టి రూ.620, రూ.1320 15 సంవత్సరముల తర్వాత ఫిట్నెస్ సర్వీసెస్ కోసం వాహనాన్ని బట్టి రూ.1620, రూ.14,120, ఓనర్ షిప్ బదిలీకి వాహరాన్ని బట్టి రూ.525లు, రూ.2,800లు గా ఫీజులు నిర్ణయించినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి వివరించారు. సకాలంలో కట్టని వినియోగదారులు అదనపు రుసుం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

లైగండలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: మండలంలోని లైగండ పంచాయతీ కేంద్రంలో డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివిధ వ్యాధులతో బాధ పడుతున్న సుమారు 50 మంది వ్యాధిగ్రస్తులు పాల్గొనగా వారికి స్థానిక పిహెచ్సి వైద్యాధికారిణి ప్రేమ, 104 వైద్యాధికారి గౌతమ్ వైద్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలను అందించారు. వ్యాధులు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారులు గిరిజనులకు అవగాహన పరిచారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వి పద్మ, హెల్త్ అసిస్టెంట్ ఎస్.ప్రభాకర్, ఏఎన్ఎం కాంత, ఎం ఎల్ హెచ్ పి.పూర్ణిమ, సిబ్బంది, గ్రామ వాలంటీర్లు ,ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

విఓఎల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వాణిశ్రీ, వెంకట్

ప్రజాశక్తి - రంపచోడవరం

వెలుగు విఒఎల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. ఎఎస్ఆర్ రంప చోడవరం జిల్లా 11 మండలాల పరిధిలోని వెలుగు యానిమేటర్ల యూనియన్ జిల్లా మహాసభలు మంగళవారం జరిగాయి. ముఖ్య అతిథులుగా పాల్గొన్న వాణిశ్రీ, వెంకట్ మాట్లాడుతూ విఒఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 10 గ్రూపుల కంటే తక్కువ ఉంటే వాళ్ళని తొలగిస్తామని బెదిరించడం సరైనది కాదన్నారు. గ్రూపుల సంఖ్యతో నిమిత్తం లేకుండా జీతాలు చెల్లించాలని, విఒఏలపై రాజకీయ వేధింపులు ఆపాలని, ఇన్సూరెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ వివోఏలు పాత్ర, వెలుగులో చాలా కీలకమైనదని, ప్రభుత్వం పథకాలు, స్కీములు, ఇతర లోన్లు వంటివి గిరిజనులకు అందించే వివోఏలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వివోఏల పోరాటాలకు పూర్తి సంఘీభావం ప్రకటిస్తున్నామని చెప్పారు.

నూతన జిల్లా కమిటీ ఎన్నిక

అనంతరం యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్ష కార్యదర్శులుగా వి.లక్ష్మయ్య, ఎ.రామకృష్ణ రెడ్డి, ఉపాధ్యక్షులుగా బషీర్ ఉన్నిసా, భాస్కర్, కన్నబాబు, జగన్, సహాయ కార్యదర్శులుగా సత్యనారాయణ, చందు, చినతల్లి, గెడ్డం శ్రీను, 25 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు సాదల విద్య సాగర్ రెడ్డి, కార్యదర్శి తీగల శ్రీనివాస్, వివోఏల సంఘం నాయకులు బసీర్, గొర్లె జగన్నాథరావు, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీతో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాణిశ్రీ, వెంకట్

రోడ్డు, వంతెన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

ఎట్టకేలకు రోడ్డు, వంతెన పనుల ప్రారంభం

ప్రజాశక్తి- కూనవరం

మండలంలోని గండికొత్త గూడెం గ్రామంలో మూడు సంవత్సరాలుగా బిల్లులు రాకుండా నిలిచిపోయిన రోడ్డు, వంతెన పనులు పున:ప్రారంభమయ్యాయి. ఈ పనులు పూర్తి చేయాలని సిపిఎం ఆధ్వర్యాన గ్రామస్తులు చేసిన పోరాటాలకు ఫలితంగా అధికారులు స్పందించి వెంటనే పనులు పనులు ప్రారంభిచాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. దీంతో మంగళవారం పనులను ప్రారంభించారు. మూడు సంవత్సరాల నుండి గ్రామస్తులు నిత్యావసరాలకు, హాస్పిటల్‌లకు, మండల కేంద్రానికి రావాలంటే ఇబ్బంది పడిన పరిస్థితులు ఉన్నాయి. ఇప్పుడు పనులు ప్రారంభం కావడం పట్ల గ్రామస్తులు ఆనందంగా వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడకం నాగమణి, సిపిఎం నాయకులు పాయం సీతారామయ్య, మేకల నాగేశ్వరావు, బాబు బొర్రయ్య, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, పాయం సత్యనారాయణ, పొడియం రామారావు, కన్నయ్య, భద్రయ్య, ఇంజనీరింగ్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి -విఆర్.పురం

మండలంలోని కుందులూరు, ములకనపల్లి గ్రామ పంచాయతీలలో అపరిష్కృతంగా సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతు సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం ములకలపల్లి గ్రామ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ కుందులూరు గ్రామంలో వాటర్ సమస్యపై పలు సార్లు ఎంపీడీవో, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తీవ్ర నిర్లక్ష్యం వహించారని తెలిపారు. పెద్దమట్ట పల్లి గ్రామం నుండి తెల్లవారిగూడెం, కుందులూరు మీదుగా నర్సంపేట గ్రామం వరకు రహదారిని నిర్మించేందుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారని, దీంతో మంచిగా ఉన్న రోడ్డును తవ్వి వదిలేసారని, దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. పెద్ద మట్టపల్లి నుండి నర్సంపేట వరకు మంజూరైన రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కొత్త రేషన్ కార్డులు వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సవలం మారయ్య, సిపిఎం మండల నాయకులు పంకు సత్తిబాబు, వడ్లాది రమేష్, బుచ్చయ్య, తెల్లం శాంతిరాజ్, సోడి వెంకటేశ్వర్లు, కుంజ భాస్కర్, సవలం కన్నయ్య, నూనె నాగేశ్వరరావు, నూనె ప్రభాకర్ పాల్గొన్నారు.

సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు

డెమో క్లాసులకు హాజరుకండి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

జిల్లాలోని గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న పీటీజీ, జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో ఆవుట్ సోర్సింగ్ పద్ధతిపై పని చేయడానికి అభ్యర్థులు డెమో క్లాస్‌లకు హాజరు కావాలని గురుకుల పాఠశాల కన్వీనర్ ఎస్కె అహ్మద్ అలీషా తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు జిల్లాలోని గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న పీటీజీ, జెల్ పోస్టులకు అవుట్ సోర్సింగ్ పద్ధతిపై 2022-2029 సంవత్సరానికి గాను పనిచేయాడానికి ఇటీవలే దరఖాస్తులు ఆహ్వానించడం జరిగిందని పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 29వ తేదీన తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో రంపచోడవరం గురుకుల పాఠశాలలో జరిగే డెమో క్లాసు, ఇంటర్వ్యూకు హాజరు కావలని కోరారు.

ఐటిడిఎలో ఆధార్ సెంటర్ ఏర్పాటు

ప్రజాశక్తి - రంపచోడవరం

ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఆధార్ అప్డేట్ చేసుకోవడానికి ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని వివిధ శాఖల్లో పని చేయుచున్న ప్రభుత్వ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఆధార్ అప్డేషన్ చేసుకునే విధంగా ఈ ఆధార్ సెంటర్ ను వారం రోజులపాటు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇతరులు కూడా ఆధార్ అప్డేషన్ చేసుకొనే విధంగా వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. ఈ ఆధార్ కేంద్రాన్ని ఏపీవో సిహెచ్ శ్రీనివాసరావు, డిఎల్‌డిఒ కె.కోటేశ్వరరావు, ఆధార్ కోఆర్డినేటర్ డేవిడ్ పర్యవేక్షించాలని పిఒ ఆదేశించారు.

మాట్లాడుతున్న సురేంద్ర

పింఛన్లు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలో తొలగించిన పింఛన్లు తక్షణమే పునరుద్ధరణ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. మండలంలో 375 గ్రామాల పరిధిలో ఆర్థికంగా వెనుకబడిన వారి పింఛన్లు తొలగించడం సరికాదన్నారు.స్థానిక సామాజిక భవనంలో విలేకరులతో సురేంద్ర మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు పింఛన్‌కు అర్హులు కలిగిన వారందరికీ ఇస్తామని చెప్పి ప్రస్తుతం నిబంధనల పేరిట పింఛన్లు తొలగించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. నాలుగు చక్రాల వాహనం ఉందని, 300 యూనిట్స్ విద్యుత్ వినియోగం, భూములు అధికంగా ఉన్నాయనే పేరుతో పింఛన్లు రద్దు చేయడం తగదన్నారు. వీటిని పునరుద్ధరణ చేయకుంటే మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాంగి భీమరాజు, కొర్ర త్రినాధ్, ఎంఎం శ్రీను పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రానున్న పండుగ సీజన్‌లో ప్రజల డిమాండ్‌ను దృష్ట్యా అదనపు రద్దీని క్లియర్ చేయడానికి ఈస్ట్ కోస్ట్ రైల్వే వివిధ గమ్యస్థానాలకు వీక్లీ స్పెషల్ రైళ్ల సేవలను పొడిగించాలని నిర్ణయించింది. అన్ని రైళ్లు ఇప్పటికే ఉన్న మార్గం, సమయాలు, స్టాపేజ్‌లతో నడుస్తాయి.

08579 విశాఖపట్నం-సికింద్రాబాద్ వీక్లీ స్పెషల్ రైలు జనవరి 4 నుంచి 23వ తేదీ వరకు ప్రతి బుధవారమూ విశాఖపట్నం నుంచి సాయంత్రం 19.00 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు 7.00 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. 08580 సికింద్రాబాద్-విశాఖపట్నం వీక్లీ స్పెషల్ రైలు జనవరి 5 నుంచి 23 వరకు ప్రతి గురువారమూ సాయంత్రం 19.40 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మరుసటి రోజు 6.40 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

08585 విశాఖపట్నం-మహబూబ్‌నగర్ వీక్లీ స్పెషల్ రైలు జనవరి 3 నుంచి ఫిబ్రవరి 28 వరకు ప్రతి మంగళవారమూ సాయంత్రం 17.35 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు 10.30 గంటలకు మహబూబ్‌నగర్ చేరుకుంటుంది. 08586 మహబూబ్‌నగర్-విశాఖపట్నం వీక్లీ స్పెషల్ రైలు జనవరి 4 నుంచి మార్చ్ 1వ తేదీ వరకు ప్రతి బుధవారం సాయంత్రమూ 18.20 గంటలకు మహబూబ్‌నగర్‌లో బయలుదేరి మరుసటి రోజు 9.50 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

08583 విశాఖపట్నం-తిరుపతి వీక్లీ స్పెషల్ రైలు జనవరి 2 నుంచి ఫిబ్రవరి 22 వరకు ప్రతి సోమవారమూ సాయంత్రం 19.10 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. 08584 తిరుపతి-విశాఖపట్నం వీక్లీ స్పెషల్ రైలు జనవరి 3 నుంచి ఫిబ్రవరి 28 వరకు ప్రతి మంగళవారమూ రాత్రి 21.55 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

08543 విశాఖపట్నం-బెంగళూరు కాంట్ సూపర్‌ఫాస్ట్ వీక్లీ స్పెషల్ రైలు జనవరి 1 నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రతి ఆదివారమూ మధ్యాహ్నం 15.55 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు బెంగళూరు కాంట్ చేరుకుంటుంది. 08544 బెంగళూరు కాంట్-విశాఖపట్నం సూపర్‌ఫాస్ట్ వీక్లీ స్పెషల్ రైలు జనవరి 2 నుంచి ఫిబ్రవరి 27 వరకు ప్రతి సోమవారమూ మధ్యాహ్నం 15.50 గంటలకు బెంగళూరు కాంట్ నుండి బయలుదేరి మరుసటి రోజు 11.00 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

02809 భువనేశ్వర్-తిరుపతి వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జనవరి 7 నుండి ఫిబ్రవరి 25 వరకు ప్రతి శనివారమూ మధ్యాహ్నం 13.55 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి, అదే రోజు సాయంత్రం 19.35 గంటలకు దువ్వాడ, ఆదివారం ఉదయం 7.50 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. 02810 తిరుపతి-భువనేశ్వర్ వీక్లీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జనవరి 8 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు ప్రతి ఆదివారమూ రాత్రి 20.00 గంటలకు తిరుపతిలో బయలుదేరి, సోమవారం ఉదయం 8.18 గంటలకు దువ్వాడ, బయలుదేరి 16.30 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది.

గ్రామాల్లో భూ రీసర్వే వేగవంతం

సబ్ కలెక్టర్ అభిషేక్

సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్

ప్రజాశక్తి-అనంతగిరి: గ్రామాల్లో భూ రీ సర్వే తరితగతిన పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్ ఆదేశించారు. స్థానిక తహశిల్దార్ కార్యాలయయంలో రెవిన్యూ సిబ్బంది తో మంగళవారం సమావేశం నిర్వహించారు. భూ రీ సర్వేపై అడిగి తెలుసుకున్నారు. సాగు పట్టాలో ఒక్కరు, సాగులో మరోకరు ఉండటంతో రైతుల మధ్య ఇబ్బందులు తలెత్తుతున్నాయని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం రీ సర్వే నిర్వహిస్తుందని తెలిపారు. మండలంలో 60 .వేల ఎకరాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నెలకు 10 వేల ఎకరాలు ఆరు నెల్లలో పూర్తి చేయాలని మొనటరింగ్ సిబ్బందికి ఆదేశించారు. గ్రామాల్లో భూ సర్వే నిర్వహించే మూడు రోజుల ముందే గ్రామ సర్పంచులకు, ప్రజాప్రతినిధులకు, గ్రామస్తులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి గ్రామంలో కూడా గ్రామసభ నిర్వహించి అనంతరం సర్వే నిర్వహించాలని తెలిపారు. ఈ సర్వేతో రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి భూమికి ఒక ప్రత్యేక నంబరు గుర్తించడం జరుగుతుందన్నారు.గ్రామాలలో ఎక్కువగా సాగుదారుడు ఒకరు ఉండగా పట్టాదారులు మరొకరు ఉండటంతో సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వీటిని గుర్తించి ప్రత్యేకంగా ఈమ సమస్యను పరిష్కరించేందుకు అనేక మార్గాలు ఉన్నాయని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటలకే సర్వేను గ్రామాల్లో చేయాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సచివాలయ సర్వేయర్లు గ్రామాలలో అందుబాటులో ఉండాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో తహసిల్దార్ రాంబాయి, డిప్యూటీ తహసీల్దార్ పాత్రుడు, మండల సర్వేయర్ పాల్గొన్నారు.

టిడిఎస్ రికవరీ బాధ్యత డిడిఒలదే

ఆదాయ పన్ను అధికారి రేణుకా దేవి

ప్రజాశక్తి-పాడేరు: సిబ్బంది జీతభత్యాలు డ్రా చేస్తున్న వివిధ కార్యాలయాల డ్రాయింగ్ అధికారులు సిబ్బంది నుండి టిడిఎస్ రికవరీ చేసే భాధ్యత వహించాలని విశాఖపట్నం ఆదాయపు పన్ను అధికారి ఎన్.రేణుకా దేవి తెలిపారు. మంగళవారం కలక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని డిడిఓలకు నిర్వహించిన టిడిఎస్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ, ప్రతి మూడు నెలలకు ఒకసారి టిడిఎస్ సరి చూసుకొని ఆదాయపు పన్ను శాఖకు తెలియపర్చాలన్నారు. సిబ్బందికి గత ఏడాది పడిన ఆదాయపు పన్నును పరిగణనలోకి తీసుకొని దాని ప్రకారం ప్రతి నెలా సిబ్బంది నుండి రికవరీ చేయటం ద్వారా సంవత్సరం చివరలో ఒకే సారి సిబ్బందిపై భారం పడకుండా చూడాలని ఆమె సూచించారు. వసూలు చేసిన టిడిఎస్ సకాలంలో కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాలన్నారు.

జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి మాట్లాడుతూ, డిడిఓలు ఆదాయపు పన్నుపై పూర్తి అవగాహన కలిగించుకొని, సిబ్బందికి ఇబ్బంది లేకుండా ప్రతి నెల టిడిఎస్ రికవరీ చేయాలన్నారు. సకాలంలో సంబంధిత సిబ్బంది చివరి నిమిషంలో హడావిడి పడకుండా సకాలంలో వ్యక్తిగత రిటర్న్ ఫైల్ చేసేలా ప్రోత్సహించాలని సూచించారు.

జిల్లా ఖజానాదికారి ప్రసాద్ బాబు మాట్లాడుతూ, ప్రతి శాఖా ట్యాన్ నంబరు పొందాలని, సిబ్బంది నుండి చేసే ఆదాయపు పన్ను రికవరీని ఆ నంబర్ ద్వారా చెల్లించినప్పుడే ఆ శాఖకు వస్తుందని, ఆ ట్యాన్

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న రేణుకాదేవి

నంబర్లో ఆదాయపు పన్ను చెల్లింపు దారుల వివరాలతో రీ కన్సిల్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను ఇన్స్పెక్టర్లు కుమార్, ఉమామహేశ్వర రావు, రమేష్, బాబ్జి, శ్రీధర్‌లు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆదాయపు పన్ను మదింపు పై వివిధ అంశాలను కూలంకషంగా వివరించారు. ఈ అవగాహన సదస్సులో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అశ్రునయనాలతో మాజీ ఎంపిపి అంత్యక్రియలు

ప్రజాశక్తి -అనంతగిరి:అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపీపీ శోభ వీరభద్ర రాజు భౌతిక కాయానికి పలు రాజకీయ పార్టీల నేతలు నివాళులర్పిస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. స్వగ్రామం భీమవరంలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు జడ్పిటిసి దీసరి. గంగరాజు, ఎంపీపీ శెట్టి. నీలవేణి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు, మాజీ ఎమ్మెల్యే శోభ. హేమావతి, రాష్ట్ర జిసిసి ఎండి స్వాతి రాణి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్, మాజీ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు సివేరి అబ్రహం, టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు శివేరి దొన్నుదొరలు తదితరులు తరలి వచ్చారు.

అంతక్రియలో పాల్గొన్న పలువురు రాజకీయ నేతలు

సర్పంచుల సమావేశంలో మాట్లాడుతున్న పాపారావు

సర్పంచులకు రూ.15 వేల గౌరవవేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:సర్పంచ్‌లకు గౌరవ వేతనాలు 3వేల నుండి 15 వేలకు పెంచాలని సర్పంచ్‌ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకపూడి పాపారావు. కోరారు. మండలంలోని అక్షయ్ ఇన్ హెూటల్‌లో అల్లురి సీతారామరాజు జిల్లా సర్పంచ్‌ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విస్తత స్థాయి సమావేశం మంగళవారం ఏర్పాటు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2023 జనవరి 5 న గుంటూరు జిల్లా తాడేపల్లి సీహెచ్‌ఆర్ కళ్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి సర్పంచ్‌ల సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్‌ల సమస్యలపై చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు.గడప గడప కార్యక్రమంలో భాగంగా పంచాయతీకి రూ.20 లక్షలు సర్పంచ్‌ల పరిధిలో ఖర్చు చేసే విధంగా వెసులుబాటు కల్పించాలని చెప్పారు. సర్పంచ్‌ల అధీనంలో గ్రామ సచివాలయం కార్యకలాపలు జరగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌ల న్యాయ పరమైన డిమాండ్స్ పరిష్కారం చేయాలని, లేని పక్షంలో భవిష్యత్తులో ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు జాస్తీ వీరా, అంజనేయులు, షేక్ అలబాక్షు, క్రిష్ణమోహన్, అల్లురి సీతారామరాజు జిల్లా సర్పంచ్లు పాంగి సునీత, కిల్లో మోస్య , చిన బాబు, కిముడు హరి, రామకృష్ణ, మట్టం శాంతికుమారి, సమిడి పూర్ణిమ, రమేష్ సింహాద్రి పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

ప్రజాశక్తి- పెదబయలు:స్థానిక జిటిడబ్ల్యు ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యాశాఖాధికారి సింహాచలంతో కలిసి ట్యాబ్‌లను పంపిణీ చేశారు.విద్యార్థులు ఎమ్మెల్యేకు థింసా నృత్యం తో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 'నాడు నేడు' మనబడి కార్యక్రమానికి కోట్లాది రూపాయలను ప్రభుత్వం వెచ్చిస్తుందన్నారు. సంక్షేమ పథకాలు వినియోగిం చుకుని ఉన్నత చదువులు చదివి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకు రావాలన్నారు. ముందుగా సీకరీ పంచాయతీ లబ్జేరి నుండి కుడాసింగ్ వరకు తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలోమ ఎంపిడిఓ విగ్నేష్, జెడ్పీటీసీ బొంజుబాబు, వైస్ ఎంపీపీ కొర్ర రాజుబాబు, ప్రధాన ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు, గురుకులం బాలుర ప్రిన్సిపల్ డి శంకర్‌రావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాద్యాయులు క్రిష్ణ వేణి, బాలికల పాఠశాల ప్రధాన ఉపాద్యాయులు గొల్లోరి మీన కుమార్, హాస్టల్ వెల్ఫేర్ అధికారి కంకిపాటి స్వర్ణలత పాల్గొన్నారు.

బస్సులను సకాలంలో నడపాలి

ప్రజాశక్తి - పెదబయలు: జోలాపుట్, పాడేరు ఆర్టీసి బస్సులు సమయ పాలన పాటించాలని ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీకారి శేషగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మాంగళవారం సాయంత్రం. స్థానిక విలేకరులతో మాట్లాడారు. పాడేరు నుండి వయా ముంచంగిపుట్టు మీదుగా జోలాపుట్టు వరకు నడిచే ఆర్టీసి సర్వీసులు సమయపాలన లేకుండా నడపడంతో ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. బస్సులు లేక లారీల్లో ప్రయాణించి గమ్యం చేరవలసి వస్తుందన్నారు.

సూరిబాబుకు సన్మానం

ప్రజాశక్తి- జి.మాడుగుల: నూతనంగా నియమితులైన పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ సూరిబాబుని మంగళవారం వైసిపి నాయకులు సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బట్టి కొండబాబు, కమిటీ డైరెక్టర్ సత్యవతి, పలువురు సర్పంచులు, మండల నాయకులు పాల్గొన్నారు.

'ఆదివాసీ జీవన గంగా' ప్రారంభం

రంపచోడవరం : రంపచోడవరం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసి జీవన గంగ పథకాన్ని అవేర్ వ్యవస్థాపక చైర్మన్ పూజశ్రీ మాధవన్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 30 గిరిజన గ్రామాల్లో బోరు బావులు నిర్మించి తాగునీటి సౌకర్యాన్ని కల్పించబోతున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వరుణ్, ప్రోగ్రాం డైరెక్టర్ సంజనా రెడ్డి, డైరెక్టరు వెంకట్ రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ నందిని రెడ్డి పాల్గొన్నారు.

మావోయిస్టుల చర్యలపై ఆదివాసీల నిరసన

ప్రజాశక్తి -చింతూరు

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుకుమా జిల్లాలో కుంట బ్లాక్ పరిధిలోని గొల్లపల్లి ఆదివాసీ గ్రామంలో మంగళవారం గ్రామస్తులు మావోయిస్టులకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. నక్సలిజం నశించాలని, అమాయక ఆదివాసీలను చంపడం ఆపాలని, అభివృద్ధిని అడ్డుకుంటూ రహదారులను ధ్వంసం చేయడం ఆపాలని నినాదాలు చేశారు. ప్రభుత్వ పథకాలను అడ్డుకుంటూ ఆదివాసీలను ఎదగనీయకుండా అడవిలోనే అనాగరికలుగా ఉండేలా చేస్తారా? అన్ని ప్రశ్నించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రజాశక్తి -చింతూరు

చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులంకు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మంగళవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చింతూరు మండలంలో మొత్తం 705 ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ పర్మద్ అహ్మద్ ఖాన్, ఎంపీపీ, జడ్పిటిసి, మండల కన్వీనర్, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, చైర్మన్, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

29న ఘంటసాల స్వరార్చన

ప్రజాశక్తి- సిరిపురం: ఘంటసాల శత జయంతి సందర్భంగా ఈ నెల 29న సాయంత్రం ఆరు గంటలకు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘంటసాల స్వరార్చన పేరిట సినీ సంగీతవిభావరి నిర్వహిస్తున్నట్టు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. మంగళవారం జెఆర్ నగర్‌లోని సెంచూరియన్ వర్సిటీ విసి ఆచార్య జిఎస్ఎన్.రాజు నివాసంలో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

సుప్రసిద్ధ సంగీత కళాకారులు కె.బ్రహ్మాజీ, వి.గోపాలకృష్ణమూర్తి, కీ బోర్డు సోమేశ్, డాక్టర్ కృష్ణ హారికలకు ఘంటసాల స్మారక పురస్కారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కళారంగ నిర్వాహకులు కొణతాల రాజు, బొమ్మిడి సత్యనారాయణ, మెలోడీ సత్యనారాయణ, వి. ప్రభాకర్, ఎన్.బంగార్రాజు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండలోని మహాలక్ష్మీ గోదాదేవి సహిత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లను ఆర్‌డిఒ భాస్కరరెడ్డి మంగళవారం పరిశీలించారు. వచ్చేనెల 1, 2, 3, తేదీల్లో ఆలయానికిసుమారు 80 వేలమంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పార్కింగ్, టాయిలెట్స్, విఐపి దర్శనాలకు సంబంధించి ఏర్పాట్లు పరిశీలించారు. వాటికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

బోరు ఏర్పాటును పరిశీలిస్తున్న అవేర్ చైర్మన్ మాధవన్

ప్రజాశక్తి-మారేడుమిల్లి : గిరిజన గ్రామాలలో మౌళిక సదుపాయాల కల్పనకు అవేర్ సంస్థ తమ వంతు కృషి చేస్తుందని ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పూజ శ్రీమాధవన్‌జీ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని సున్నంగండి, పీజీ లంక, రాశిలోవ, డివికోట, తాడేపల్లి, డీసీహెచ్ పల్లి గ్రామాలలో పర్యటించారు. అక్కడి గిరిజనులో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవేర్ సంస్థ 48 సంవత్సరాలు నుంచి దేశంతో పది రాష్ట్రంలో 190,000 వేల గ్రామాలకు సేవలందించిందని తెలిపారు. ఏజెన్సీలో గత 20 సంవత్సరాలు నుంచి 200 గిరిజన గ్రామాలకు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని చెప్పారు. ఏజెన్సీలో 40 గిరిజన గ్రామాలకు ఇప్పటికై వారులు వేసి తాగునీటి సదుపాయం కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యకరమంలో అవేర్ సిబ్బంది. పలు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు..

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని స్థానిక ఎంపీడీవో కె బాపన్నదొర అన్నారు. మంగళవారం మండలంలోని చెరుకుంపాలెం, జడ్డంగి సచివాలయాలయాలను ఆయన ఆకస్మిక తనికీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాపన్నదొర మాట్లాడుతూ పెన్షన్ నిలుపుదల చేస్తూ నోటీసులు జారీ చేసిన వాటిని తక్షణం పరిశీలించి వాటికి సంబంధించిన పూర్తి వివరాలు ఎంపీడీవో కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. అర్హత ఉన్న ఏ ఒక్కరికి పెన్షన్ నిలుపుదల కాకుండా చూడాలని, వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్డంగి చెరుకుంపాలెం సర్పంచులు కె మురళీకృష్ణ, డి నాగేశ్వరరావు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ బాపన్నదొర

137 మంది పింఛనుదారులకు నోటీసులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 137 మంది పెన్షన్‌దారులకు వివిధ కారణాల నేపథ్యంలో రద్దుకు నోటీసులు జారీ చేయడం జరిగిందని స్థానిక ఎంపీడీవో కె బాపన్నదొర మంగళవారం తెలిపారు. వీరిలో ఎక్కువమంది లబ్ధిదారులకు భూమి ఎక్కువగా చూపించడం జరిగిందని పేర్కొన్నారు. మరి కొంతమందివి 300 యూనిట్లు కరెంట్ బిల్లు దాటిందని, నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్న వారిని తెలిపారు. నోటీసులు అందుకున్న పెన్షన్ దారులు ఈనెల 29 లోగా పూర్తిస్థాయి సమాచారం తమ సమీపంలోని సచివాలయంలో అందజేస్తే జనవరి నుండి పింఛను పునరుద్ధంచడం జరుగుతుందని తెలిపారు.

ఎంపిడిఒ బాపన్నదొర

యువత నైపుణ్యాభివృద్ధి శిక్షణకు

స్టీల్‌ప్లాంట్, సెమ్స్ మధ్య అవగాహన ఒప్పందం

ఒప్పందపత్రాలను మార్చుకుంటున్న స్టీల్‌ప్లాంట్,సెమ్స్ అధికారులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : యువతకు సాధికారత కల్పించే దిశగా అవసరమైన నైపుణ్యాభివృద్ధి శిక్షణనిచ్చేందుకు విశాఖ స్టీల్‌ప్లాంట్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ (సిఇఎంఎస్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. మంగళవారం విశాఖపట్నం గాంధీగ్రామ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సిజిఎం(హెచ్‌ఆర్)-సిఎస్ జి.గాంధీ, సెమ్స్ సిఇఒ కె.సేతుమాధవన్ ఎంఒయు కుదుర్చుకుని, పరస్పరం ఒప్పందపత్రాలను మార్చుకున్నారు. అనంతరం శిక్షణను ప్రారంభించి, శిక్షణార్థులతో మాట్లాడారు. ఒప్పందంలో భాగంగా పరిశ్రమల ఆధారిత ఉదాహరణలు, కేస్ స్టడీస్, గ్రూప్ డిస్కషన్‌లు, గ్రూప్ పరీక్షల ద్వారా పర్సనాలిటీ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్‌తో కూడిన సాఫ్ట్ స్కిల్స్‌పై కాంపిటెన్సీ బేస్డ్ ట్రైనింగ్ మెథడాలజీ ద్వారా ట్రైనీలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు.దీనికోసం కార్పొరేట్ ఎన్విరాన్‌మెంటల్ రెస్పాన్స్‌బిలిటీ కింద ఆర్ఐఎన్ఎల్ రూ.8.44లక్షల ఆర్థికసాయాన్ని సమకూరుస్తోంది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ సిఎస్ఆర్ అధికారులతోపాటు సెమ్స్ అధికారులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ కార్డులకు పేర్లు నమోదు

ప్రజాశక్తి -కంచరపాలెం : ఈ శ్రమ కార్డులకు పేర్లు నమోదు చేసుకుని ఉచితంగా పొందడం ద్వారా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వర్కర్స్ ఇన్ఫర్మేషన్ సపోర్ట్ సెంటర్, జెఎసి, విశాఖపట్నం, ఎపి అండ్ టిఎస్ వైస్ ప్రెసిడెంట్ మేరపురెడ్డి కొండబాబు సూచించారు. ఐఎల్ ప్రోత్సాహంతో, జెఎఫ్, ఎపి లీడ్ బై ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో ఊర్వశి జంక్షన్ వద్ద ఉచితంగా నమోదు, మరియు కార్డులు పంపిణీ కార్యక్రమం మంగళవారం చేపట్టారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే ఈ-శ్రమ కార్డులను కార్మికులంతా పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి, ఎపి అండ్ టిఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుమ్మడి ఆదినారాయణమూర్తి, వీరాంజనేయ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు డి వీరబాబు, అసంఘటితరంగ కార్మికుల జెఎసి నేతలు పొలమరశెట్టి సురేష్, విశాఖ డెయిరీ యూనియన్ నాయకులు ఉదయగిరి శ్రీనివాసరావు, అమరాన జగదీష్ పాల్గొన్నారు.

కోవిడ్ వైద్యసేవల సన్నద్ధతపై సమీక్ష

ఏర్పాట్లపై మాక్‌డ్రిల్ : పర్యవేక్షించిన విమ్స్ డైరెక్టర్

వంద పడకలతో వార్డులు సిద్ధం

సాధారణ రోగులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక బ్లాక్

మన దేశంలోనూ ప్రభావం చూపే అవకాశాలున్నాయని వైద్యనిపుణులు అంచనాల నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోవిడ్ వైద్యసేవల సన్నద్ధతపై అప్రమత్తమయ్యాయి. ఇందులో భాగంగా మొదటి, రెండో వేవ్ కరోనా విజృంభణ సమయంలో డెడికేటెడ్ కోవిడ్ ఆసుపత్రిగా నిలిచిన విమ్స్‌లోనూ తాజా సన్నద్ధత చర్యల్లో భాగంగా 100 పడకలను సిద్ధం చేశారు. మంగళవారం దీనికి సంబంధించిన మాక్ డ్రిల్‌ను విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు పర్యవేక్షణలో నిర్వహించారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ రాంబాబు మాట్లాడుతూ కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనే చర్యల్లో బాగంగా మందులు, ఆక్సిజన్‌కు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు సరిపడా నిల్వలు సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతానికి వంద పడకలను కేటాయించామని, అవసరాన్ని బట్టి వాటిని 600 పడకల వరకు పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి పడకకు ఆక్సిజన్ సదుపాయంతోపాటు 200 ఐసియు పడకలకు అందుబాటులోకి తీసుకురాగల సామర్థ్యం విమ్స్ ఆస్పత్రికి ఉందన్నారు. విమ్స్‌లో అందుబాటులో ఉన్న రెండు ఆక్సిజన్

ఏర్పాట్లపై సమీక్షిస్తున్న విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు

ట్యాంకులు, రెండు ఆక్సిజన్ ప్లాంట్లు పరిశీలించి పని తీరును గమనించామన్నారు. వైద్యులు, అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో రోగులకు ఉత్తమ వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

కోవిడ్ జ్వరాలకు ప్రత్యేక బ్లాకు

ప్రస్తుతం సాధారణ రోగులకు ఉత్తమ వైద్యం అందించడంలో నిమగ్నమైన విమ్స్ ఆస్పత్రిలో కోవిడ్ లక్షణాలతో కూడిన జ్వరాలకు ప్రత్యేక బ్లాక్‌లో ఒపిని నిర్వహించి, అక్కడ వ్యాధి నిర్ధారణ పరీక్షలు అనంతరం కోవిడ్ అయితే సంబంధిత వార్డుకు, లేకుంటే సాధారణ జ్వరాల వార్డుకు తరలించి వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు విమ్స్ డైరెక్టర్ రాంబాబు వెల్లడించారు.